క్లుప్తంగా

కోయగూడెం ఓసీలో పర్యటించిన జీఎం

టేకులపల్లి: ఇల్లెందు ఏరియా జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జాన్‌ ఆనంద్‌ మంగళవారం కోయగూడెం ఉపరితలగనిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓసీలో పరిశీలించిన ఆయన రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత వివరాలు తెలుసుకుని లక్ష్యాల సాధనపై సూచనలు చేశారు. ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ ఎస్‌.వీ.ఆర్‌.ప్రహ్లాద్‌, మైన్‌ మేనేజర్‌ సౌరబ్‌ సుమన్‌తో పాటు శివశంకర్‌, రాజు, బ్రహ్మం, రవికుమార్‌, అశోక్‌, నాగేశ్వ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం నాయకులు మంగళవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. బానోత్‌ విజయ బాయి, సొసైటీ చైర్మన్‌ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, నర్వనేని పుల్లారావు, వందనపు సత్యనారాయణ, పోతురాజు నాగరాజు, అల్లాడి లింగారావు, గోపాల్‌రెడ్డి, సురేష్‌, ముత్తయ్య, భద్రయ్య, అమృ, నునావత్‌ రాందాస్‌, నరసింహారావు, పాల్గొన్నారు.

తునికాకు బోనస్‌ చెల్లించాలి

ఇల్లెందురూరల్‌: తునికాకు బోనస్‌ కూలీలకు తక్షణమే చెల్లించాలని కోరుతూ న్యూడెమోక్రసీ నాయకులు మంగళవారం ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. కూలీలకు అందించాల్సిన ప్రయోజనాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తుపాకుల నాగేశ్వరరావు, ఇందూరి సాగర్‌, లక్ష్మీనారాయణ, డి.ప్రసాద్‌ పాల్గొన్నారు.

బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడిగా రాములు నాయక్‌

జూలూరుపాడు: ఆల్‌ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడిగా గంగారం తండాకు చెందిన మానోత్‌ రాములు నాయక్‌ను నియమించారు. మంగళవారం జూలూరుపాడులో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ శంకర్‌ నాయక్‌, ధరావత్‌ రామ్మూర్తి నాయక్‌లు రాములు నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేసి, శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి

జూలూరుపాడు: బీసీ రుణాల దరఖాస్తుల గడువును పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... దరఖాస్తు గడువు ముగియడంతో అర్హులైన బీసీలకు రుణ సాయం అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గార్లపాటి వెంకటి, ఉపేందర్‌, మల్లయ్య, పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా ఆధ్వర్యంలో..

బీసీ రుణాల కోసం దరఖాస్తు గడువును పెంచాలని సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా ఆధ్వర్యంలో మండల పరిషత్‌ సూపరింటెండెంట్‌ తాళ్లూరి రవికి వినతి ప్రతం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి ధర్మా, గోపాల్‌రావు, రాయల సిద్ధు, కృష్ణయ్య పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

పాల్వంచరూరల్‌: మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో పోలింగ్‌ కేంద్రాలను, ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను తహసీల్దార్‌ రంగాప్రసాద్‌ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్‌ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. ఆర్‌ఐ హచ్యా ఉన్నారు.

మొక్కంపాడులోనే జీపీని కొనసాగించాలి

టేకులపల్లి: మండలంలోని మొక్కంపాడులోనే పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం గ్రామస్తులతో పాటు కలెక్టర్‌ అనుదీప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలో నెలకొన్న వివాదాన్ని వివరించిన వారు, ఆదివాసీ గ్రామంలోని జీపీ కార్యాలయాన్ని మొక్కంపాడు తండాకు తరలించిన సర్పంచ్‌, వార్డు మెంబర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వాసం రామకృష్ణ దొర, రమనాల లక్ష్మయ్య, కుంజ వెంకటేశ్వర్లు, దుగ్గరావు వీరభద్రం, వట్టం కన్నయ్య పాల్గొన్నారు.

108లో ప్రసవం

టేకులపల్లి: పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని సిద్ధారానికి చెందిన ఎస్‌.శ్రీనివాస్‌ భార్య కృష్ణవేణికి మంగళవారం పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్‌ చేయగా సిబ్బంది సిద్ధారం చేరుకుని ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే నొప్పులు ఎక్కువ కాగా ఈఎంటీ అశోక్‌, పైలెట్‌ కె.వెంకటరామారావు ఆమెకు పురుడు పోసి పీహెచ్‌సీకి తరలించారు.

ఇసుక, మట్టి.. ఇష్టారాజ్యం

- తవ్వి తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు
- రాత్రివేళల్లో విచ్చలవిడిగా దందా



రాత్రి వేళ మట్టి తరలిస్తున్న వాహనం



తోగ్గూడెం శివారు మొర్రేడువాగు నుంచి ఇసుక తరలించిన ఆనవాళ్లు

పాల్వంచరూరల్‌: గృహ నిర్మాణాలు, రహదారుల పనులు జోరుగా సాగుతుండడంతో ఇసుక, మట్టికి డిమాండ్‌ పెరిగింది. ఇదే అదునుగా అక్రమార్కులు దందాకు తెరలేపారు. రాత్రీ, పగలు తేడా లేకుండా ఇసుక, మట్టి తరలిస్తుండడంతో వాగుల్లో భారీ లోతుతో గుంతలు ఏర్పడుతుండగా, గుట్టలు కరిగిపోతున్నాయి. అధికారుల చూసీచూడని తనాన్ని ఆసరా చేసుకుంటున్న పలువురు దందాతో రూ.లక్షలు పోగు చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతి మట్టి, ఇసుక అక్రమ రవాణాతో రహదారులు ఛిద్రమవుతుండగా, రాత్రివేళ వచ్చి వెళ్లే వాహనాలతో స్థానికులకు నిద్ర కరువవుతోంది. ఈ వ్యవహారంలో మైనింగ్‌, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడెక్కడి నుంచి అంటే...

మండలంలోని తోగ్గూడెం, రాజాపురం, కిన్నెరసాని, కేశవాపురం, బస్వతారక కాలనీ ప్రాంతాల్లో మట్టి నిల్వలు అపారంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రైవేట్‌, ప్రభుత్వ అసైన్డ్‌ భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండానే రాత్రి సమయంలో జేసీబీలతో మట్టి తవ్వి లారీల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీంతో చీకటి పడితే చాలు కిన్నెరసాని, తోగ్గూడెం ప్రధాన రహదారులపై మట్టి లారీలు, ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు జోరందుకుంటున్నాయి. మరికొందరు రాజాపురం, కిన్నెరసాని పరిసర గ్రామాల పరిధి భూముల నుంచి కూడా మట్టి తరలిస్తున్నారు. ఇక మట్టి తరలింపు కారణంగా గుట్టల చుట్టూ ఉన్న పచ్చని చెట్లు కూడా కనుమరుగవుతున్నాయి. ఒక్కో లారీ మట్టిని రూ.4వేల నుంచి రూ.6వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తోగ్గూడెం సమీపాన మొర్రెడు వాగు నుంచి రాత్రి వేళ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాల్లో డంపింగ్‌ చేసి అక్కడి నుంచి లారీల్లో ద్వారా నిర్దేశించిన ప్రాంతాలకు గుట్టుగా తరలిస్తున్నట్లు సమాచారం.

డిమాండ్‌ ఆధారంగా తరలింపు

అక్రమార్కులు రాత్రి సమయంలో మొర్రేడు, కిన్నెరసాని వాగులు, రైతుల పంట పొలాల, గుట్టల నుంచి తవ్విన మట్టిని పాల్వంచతో పాటు కొత్తగూడెం ఇతర పట్టణాలకు తరలిస్తున్నారు. గృహ నిర్మాణాలు జోరందుకున్న నేపథ్యాన మట్టికి డిమాండ్‌ ఉండడంతో వారి పంట పండుతోంది. ఒకవేళ ఇసుక, మట్టికి గిరాకీ లేకున్నా ఏదో ఓ చోట డంప్‌ చేసి డిమాండ్‌ పెరిగినప్పుడు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎత్తుపల్లాలు, గుట్టలుగా ఉన్న ప్రదేశాల్లోని మట్టిని తవ్వడం ద్వారా భూమి చదును అవుతుందని కొందరు రైతులు మట్టి తవ్వకునేందుకు అవకాశం కల్పించడాన్ని అక్రమార్కులు ఆసరాగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకోవాలి



తోగ్గూడెం, రాజాపురం ప్రాంతాల్లో రాత్రి వేళ పంట పొలాల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. తోగ్గూడెంలోని మొర్రేడు వాగు, రాజాపురం వద్ద నుంచి మట్టి తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– కొడుపుగంటి శ్రీనివాస్‌, పాల్వంచ

ఇప్పటికే నిఘా వేశాం



అనుమతి లేకుండా మట్టి, మొరం, ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టాభూముల యజమానులు కూడా మట్టి తరలింపునకు అనుమతి తీసుకోవాలి. కొన్నిచోట్ల మట్టి, ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో రాత్రి వేళ మా సిబ్బంది నిఘా పెంచాం.

– రంగాప్రసాద్‌, తహసీల్దార్‌, పాల్వంచ

‘ఉపా’ కేసులన్నింటినీ ఎత్తివేయాలి..

టేకులపల్లి: ప్రజాసంఘాల నాయకులపై తాజాగా నమోదు చేసిన ‘ఉపా’ కేసులే కాకుండా గతంలో పెట్టిన కేసులను కూడా ఎత్తేయాలని పలువురు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్‌ రమణాల లక్ష్మయ్య, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌ వాసం రామకృష్ణ దొర, తెలంగాణ ప్రజాఫ్రంట్‌ రాష్ట్ర కన్వీనర్‌ మెంతిని సంజీవరావు, రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు కుంజ వెంకటేశ్వర్లు, అంబేడ్కర్‌, పూలే యోజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎట్టి ప్రశాంత్‌, ఎమ్మార్పీఎస్‌ మండలాధ్యక్షుడు మెంతెన ప్రభాకర్‌ మాట్లాడారు. తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో గతేడాది పలువురు ప్రజాసంఘాల నాయకులు, మేధావులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని సీఎం ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే, ఈ కేసులే కాకుండా గతంలో పెట్టిన ‘ఉపా’ కేసులను కూడా తొలగించాలని డిమాండ్‌ చేశారు. అణచివేతలో భాగంగా ఇలాంటి కేసుల నమోదుకు పోలీసులకు సూచనలు చేస్తున్న పాలకులు తమ వైఖరి మార్చుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న నాయకులు

స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న నిమ్మీ ఆనంద్‌

ఇల్లెందు: జేకేటీసీ ప్రభావిత గ్రామాల మహిళలకు చేయూతగా ఉండేందుకు స్వయం ఉపాధి కల్పించేందుకు సింగరేణి సేవాసమితి కృషి చేస్తుందని సేవా సమితి నూతన అధ్యక్షురాలు నిమ్మీ ఆనంద్‌ స్పష్టం చేశారు. మంగళవారం సింగరేణి సేవా సమితీ నూతన అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్మీ ఆనంద్‌ను మాజీ సేవా సమితీ అధ్యక్షురాలు మధురవాణీని సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్‌ జీవీ మోహన్‌రావు, డీవైపీఎం శ్రీహరి, సేవాసమితీ సమన్వయ అధికారి కె. సాయి స్వరూప్‌, సేవా కార్యదర్శి విజయ, కో ఆర్డినేటర్‌ కోట సాంబయ్య, కిషోర్‌, సభ్యులు కోమలీ, సరిత, చంద్రకళ, పద్మ, సేవాసమితీ శిక్షకులు విజయలక్ష్మీ, సంధ్యారాణీ, ఆశ, సుప్రియ తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఇల్లెందురూరల్‌: జూలై 4 నుంచి ఇల్లెందులో నిర్వహించనున్న పీవైఎల్‌ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పీవైఎల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్‌ కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రచార పోస్టర్లను మండలంలోని పోలారం గ్రామ పంచాయతీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభల్లో పాలకుల వైఖరిని ఎండగట్టేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య మంగ్య, సురేష్‌, నరేష్‌, రామకృష్ణ, నాగార్జున్‌ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌లో చేరిన జనరల్‌ మజ్దూర్లు



ఎమ్మెల్యే హరిప్రియతో జనరల్‌ మజ్దూర్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పనిచేస్తున్న పలువురు జనరల్‌ మజ్దూర్లు టీబీజీకేఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు రంగనాథ్‌ నేతృత్వాన వీరు టీబీజీకేఎస్‌లో చేరారు. టీబీజీకేఎస్‌లో చేరిన వారిలో జంగమేశ్వరరావు, యలదండి విజయ్‌కుమార్‌, మధుకర్‌, గణేష్‌, ఈశ్వర్‌, శివ, అజ్జు, పాషా తదితరులు ఉండగా, నాయకులు బానోతు రవినాయక్‌, కోటయ్య, గౌస్‌ పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జుబేదా

కొత్తగూడెంటౌన్‌: ప్రతీ ఒక్కరికి సైబర్‌ నేరాలపై అవగాహన ఉండాలని కొత్తగూడెం పరిధిలోని రామవరం టూటౌన్‌ ఎస్సై జుబేదా అన్నారు. మంగళవారం రామవరంలోని సాధన గ్రౌండ్‌లో యువతకు సైబర్‌ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరె రమేష్‌కుమార్‌, ఎస్కే అక్బర్‌, వేణు పాల్గొన్నారు.

జ్యూట్‌ బ్యాగుల పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ఏరియా జీఎం కార్యాలయంలో భారత్‌ అమృత్‌ మహోత్సవ్‌ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు, ఉద్యోగులకు జ్యూట్‌ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జీఎం జక్కం రమేష్‌, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్‌, ఏజీఎం పర్సనల్‌ సామ్యేల్‌ సుధాకర్‌, ఎన్విరాల్‌మెంట్‌ మేనేజర్‌ టి.సత్యనారాయణ, సీనియర్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ రమణారెడ్డి, సీనియర్‌ పీఓలు సుధాకర్‌, మురళి, కో ఆర్డినేటర్‌ సాగర్‌, సిబ్బంది, పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

పాల్వంచ: పట్టణ పరిధిలోని కేఎస్‌ఎం దాబాల వద్ద ఇరువర్గాలు మద్యం మత్తులో ఘర్షణకు దిగి దాడికి పాల్పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం దాబాల వద్ద ఓ ఆటో డ్రైవర్‌తోపాటు, శేఖరం బంజర, కొత్తగూడెం సర్వారానికి చెందిన ఇరు వర్గాల వారు రోడ్డుపైనే గొడవ పడి దాడులకు పాల్పడ్డారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్సై నరేష్‌ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఐను కలిసిన నాయకులు

కొత్తగూడెంటౌన్‌: రామవరం పరిధిలోని టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో సీఐ టి.రమేష్‌ను మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల విషయంతో పాటు పలు విషయాలను తెలియజేశారు. మోరె రమేష్‌కుమార్‌, అక్బర్‌, తంబళ్ల నాగయ్య, మల్లేష్‌, ఎల్లయ్య, నరేష్‌, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: స్వరాష్ట్రంలోను తెలంగాణా ఉద్యమకారులకు ఒరిగిందేమీ లేదని టీపీసీసీ జనరల్‌ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. స్థానిక బస్టాండ్‌ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణా ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 24గంటల సత్యాగ్రహ దీక్ష శిబిరాన్ని ఎడవల్లి కృష్ణ మంగళవారం సందర్శించి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ద్రోహులను కేసీఆర్‌ అందలం ఎక్కించారన్నారు. కేసీఆర్‌ చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, నియంతృత్వ పోకడలను వచ్చే ఎన్నికల్లో తిప్పి కొట్టడం ఖాయమన్నారు. అనంతరం ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, మండల అధ్యక్షులు కొండం వెంకన్న, బద్ది కిశోర్‌, బత్తుల వెంకటేశ్వరరావు, చంద్రగిరి సత్యనారాయణ, ఉద్యమకారుల సంఘం నాయకులు రషీద్‌, మంజూరు, గౌస్‌, ఉబ్బన శ్రీను, రాము, పెద్ది తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు వినతి

పాల్వంచ: తెలంగాణా అమరవీరుల కుటుంబాలను, ఉద్యమ కారులను ఆదుకోవాలని తెలంగాణా ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు వినతిపత్రం అందించారు. మహాత్మా గాంధీ, కొమరంభీం, అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎండి.మంజూర్‌, బొల్లం భాస్కర్‌, ఇజ్జగాని రవిగౌడ్‌, పాదిలి సూరిబాబు, శ్రీపాద సత్యనారాయణ, ఐల శ్రీను, ఎండి.అసిబ్‌, రషీద్‌, ఎస్‌జెకె అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

ఇల్లెందు: రాష్ట్రవ్యాప్తంగా 61 చోట్ల భూపోరాట కేంద్రాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల పోరాట వేదిక డిమాండ్‌ చేసింది. మంగళవారం ఇల్లెందులోని రాజీవ్‌నగర్‌ తండా వద్ద రెండేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలను సందర్శించిన వారితో నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్‌. వీరయ్య మాట్లాడారు. నబీ, కృష్ణ, ఆలేటి కిరణ్‌, మోహన్‌రావు, సుల్తాన, శంకర్‌, వెంకటమ్మ, ఖాదర్‌, రాందాస్‌, పాషా, వెంకన్న పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే హామీలు అమలు

జూలూరుపాడు: కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేరుస్తామని టీపీసీసీ సభ్యుడు ధరావత్‌ రామ్మూర్తి నాయక్‌ తెలిపారు. జూలూరుపాడులో మంగళవారం ఏర్పాటుచేసిన లీడర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌ మిషన్‌(ఎల్‌డీఎం) కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువకులను ప్రోత్సహించడంతోపాటు నాయకత్వ లక్షణాలను గుర్తించి బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు. నాయకులు డాక్టర్‌ శంకర్‌నాయక్‌, దంపటి నగేష్‌, నున్నా కృష్ణయ్య, బానోత్‌ నవీన్‌రాథోడ్‌, మాలోత్‌ నాగేంద్రబాబు, బానోత్‌ రాజేష్‌, కొలిపాక వెంకటేశ్వరరావు, గుగులోత్‌ శ్రీనివాసరావు, కొమ్మినేని రాంబాబు, కొలిపాక శ్రీనివాసరావు, బానోత్‌ రాములు, మందా బాబు, కొమ్ము రవి, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

జూలూరుపాడు: కరీంనగర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై ఏబీవీపీ దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం జూలూరుపాడులో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌ కుమార్‌ మాట్లాడుతూ... అనుమతి లేకుండా యూనిఫాం, పుస్తకాలు అమ్ముతుంటే ఆందోళన చేస్తున్న నాయకులపై యాజమాన్యానికి మద్దతుగా నిలిచి దాడికి పాల్పడటం దారుణమన్నారు. కొత్తగూడెం డివిజన్‌ అధ్యక్షుడు బోడా అభిమిత్ర, మండల కార్యదర్శి జెమ్మి యశ్వంత్‌, వికాస్‌, ప్రసాద్‌, చరణ్‌, నవదీప్‌, అఖిల్‌, సూర్య, పాల్గొన్నారు.

పాడైన సరుకులపై ఫిర్యాదు

పాల్వంచ: పట్టణంలోని అంబేడ్కర్‌ సెంటర్‌ కేఎస్‌పీ రోడ్డులో గల ఓ సూపర్‌ మార్కెట్‌లో పాడైన సరుకులు రావడంతో వినియోగదారుడు ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి పుట్టగొడుగులు కొనుగోలు చేసిన వ్యక్తి ఇంటి కెళ్లి చూడగా పాడైన వాసన రావడంతో మంగళవారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసాడు. దీంతో ఆహార భద్రతా తనిఖీ అధికారి మణికంఠ రెడ్డి తనిఖీ చేసి విచారించి, కేసు నమోదు చేశారు.

యోగాతో ప్రయోజనాలు

కొత్తగూడెంఅర్బన్‌: యోగా ఆసనాలు చేయడంతో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక వివేకనంద పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జ్‌ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలి

టేకులపల్లి: మున్నూరుకాపులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం టేకులపల్లి తహసీల్దార్‌ వీరభద్రంకు వినతిపత్రం అందజేశారు. కులవృత్తుల కోసం ఏర్పాటుచేసిన పథకాలను మున్నూరు కాపులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్కినేని వెంకటేశ్వరరావు, గంగారపు శేషయ్యతో పాటు నారందాస్‌ కోటేశ్వరరావు, కడుదుల రామారావు, నర్సింగ్‌ లక్ష్మయ్య, పాశం హరినాథ్‌బాబు, దోర్నాల శ్రీనివాస్‌, కంది వెంకటేశ్వర్లు, కడుదుల రాము, ఆకుల మల్లికార్జున్‌, కడుదుల కిషోర్‌ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న జక్కం రమేష్‌ కార్పొరేట్‌ సీపీపి జీఎంగా బదిలీపై వెళ్తున్న క్రమంలో మంగళవారం ఏరియాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు ఎండి.రజాక్‌ మాట్లాడుతూ.. సాధించిన ఉత్పత్తి బొగ్గును రవాణా చేయటంలో ఆయన చేసిన కృషి ఘనణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సామ్యుల్‌ సుధాకర్‌, జీకేటీసీ పీఓ శ్రీరమేష్‌, సీనియర్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ రమణారెడ్డి, ఎస్‌ఈ స్టోర్స్‌ రత్నప్రకాశ్‌, మేనేజర్లు ఎస్‌.ఎస్‌.ఆర్‌ మురళి, 11 మెన్‌ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, రీజియన్‌ సెక్రటరీ కాపు కృష్ణ, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

విద్యారంగానికి మహర్దశ..

- ఘనంగా విద్యా దినోత్సవం
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, రాగిజావ పంపిణీ
- పలువురు ఉపాధ్యాయులకు సన్మానం

మన ఊరు మనబడితో విద్యారంగానికి మహర్దశ వచ్చిందని పలువురు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. ముందుగా ర్యాలీలు నిర్వహించి పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



టేకులపల్లి: పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



పాల్వంచ: మహనీయులకు నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేందర్‌



పాల్వంచరూరల్‌: ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకుంటున్న వై.చిన్నప్పయ్య



సుజాతనగర్‌: పుస్తకాలతో విద్యార్థులు..



ఇల్లెందురూరల్‌: రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ వల్లాల మంగమ్మ



సూపర్‌బజార్‌ కొత్తగూడెం: ఉత్సవాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



పాల్వంచరూరల్‌: సావిత్రిబాయిపూలే విగ్రహనికి పూలమాలలువేసి నివాళి..



జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అవార్డు అందుకుంటున్న కాకర్ల జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బాలాజీ